క్లుప్తంగా

పంచాయతీ ప్రమేయం లేకుండానే భవన నిర్మాణం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శివచంద్రారెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ పంచాయతీ ప్రమేయం లేకుండానే సివిల్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నారని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ శ్రీధర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా పంచాయతీ అనుమతి తప్పనిసరి అన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ అనుమతులు మంజూరు చేయడమంటే పంచాయతీ అధికారాలను కాదనడమేనన్నారు. కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణపు అనుమతుల ఫీజులను పంచాయతీలకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విభజన హామీలు అమలుచేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభించాలని కోరుతూ సీపీఐఎం ఆధ్వర్యంలో జీపు జాతా శుక్రవారం నగరంలోని జడ్పీ నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకాలకే పరిమితమైందని, పనులు ప్రారంభించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నెల్లూరులో జరుగుతున్న రాష్ట్ర మహాసభలలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు తీర్మానం చేస్తున్నామని తెలిపారు. మనోహర్, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, రమణ, భైరవప్రసాద్, సురేష్‌కుమార్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

వైద్యుడికి సన్మానం



డాక్టర్‌ను సన్మానిస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్: కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కంటి వైద్య నిపుణుడిగా పనిచేస్తున్న డాక్టర్ డి.రాంబాబు పదవీ విరమణ చేయడంతో సిబ్బంది శాలువా, పూలమాలలతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ రాంబాబు విధి నిర్వహణలో ఖచ్చితంగా ఉంటూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, డాక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ గురువర్మ, డాక్టర్ అస్మ, డాక్టర్ వెంకటయ్య, ఆప్తాలమిక్ ఆఫీసర్ కె. చిన్నయ్య, విజయ్‌కుమార్, రవి, లక్ష్మీకర్ రెడ్డి, మధుసూదన, రాము, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి వితరణ




బియ్యం బస్తాలు అందజేస్తున్న ఖాసింఖాన్

కడప కల్చరల్: ఫిబ్రవరి 1, 2 తేదీలలో మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో నిర్వహించనున్న బాలోత్సవం కార్యక్రమానికి నగర ప్రముఖ విద్యావేత్త, ఆడిటర్ లయన్ కె.ఖాసింఖాన్ తన వంతుగా రెండు రోజుల అన్నదానానికి 20 బస్తాల బియ్యాన్ని అందజేశారు. లయన్ పి.మన్సూర్ అలీఖాన్, జి.గోపాల్, షరీఫ్‌ఖాన్, సయ్యద్ మౌల, జావీద్, సాయి, మస్తాన్ ,ఇమ్రాన్‌పాల్గొన్నారు.

స్వామికి సర్వభూపాల వాహనం

కడప కల్చరల్: తిరుమలేశుని తొలిగడప దేవుని కడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామికి అర్చకులు శుక్రవారం సర్వభూపాల వాహనాన్ని సమర్పించారు. ఆలయ సూపరింటిండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి సమక్షంలో వాహనానికి విశేష పూజలు నిర్వహించారు. ఈ వాహనాన్ని అటు కల్పవక్షంగా, సర్వభూపాల వాహనంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని అర్చకులు వివరించారు.

పాఠశాలను ఉన్నతీకరించండి



వినతిపత్రం ఇస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉర్దూ పాఠశాలలు విలీనం కాకుండా స్పష్టమైన ఆదేశాలివ్వాలని రూట నాయకులు సయ్యద్ హిదయతుల్లా, సయ్యద్ ఇక్బాల్, టీడీపీ నాయకులు ఎస్.అమీర్‌బాబు, జిలానీబాషా కోరారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్‌ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 45 ఉర్దూ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాహీదుల్లా, మహమ్మద్ అయూబ్, అబ్దుల్ హకీంసాహెబ్, సయ్యద్ సిరాజుద్దీన్ , అఫ్జల్ బాషా, జాకీర్‌హుస్సేన్, జుబేర్‌అహ్మద్ , బేపారి ఫక్రుద్దీన్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

ఇరుకు వీధులు.. భక్తులకు కష్టాలు

కడప గడప వేంకటేశ్వరుడి తిరుణాలకు వచ్చే భక్తులకు కష్టాలు తప్పడం లేదు. మాడ వీధులు ఇరుకుగా మారడం.. ఒక వాహనం వస్తే రెండో వాహనం పక్కకు తప్పుకోవాల్సిన పరిస్థితులు ఉండడంతో ఇబ్బందులు పడాల్సిందే. తిరుణాలలో ఏర్పడే దుకాణాలతో మరింత ఇరుకుగా మారనున్నాయి.

- రథం కదిలే మాడ వీధుల్లో దుకాణాలు
- ఒక వాహనమే వెళ్లేంతగా రహదారులు



ఆలయ ఎదురుగా ఇరుగ్గా, గందరగోళంగా వీధులు

కడప కల్చరల్: దేవుని కడప లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఫిబ్రవరి 4న రథోత్సవం నిర్వహించనున్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న మాడవీధులు, రథం తిరిగే ప్రాంతపు రోడ్లు కొత్తగా ఏర్పాటయ్యే దుకాణాలతో మరింత ఇరుకుగా మారే పరిస్థితి ఉంది. భక్తులు సులభంగా రోడ్డుపై నడిచే పరిస్థితి కనిపించడం లేదు. ఆది నుంచి ఆక్రమాలకు అడ్డుకట్ట వేసేవారు లేక దుకాణదారులతో పోట్లాడాల్సి వస్తుందన్న భయంతోనో గ్రామస్తులు, అధికారులు అడ్డుకోలేకపోయారు. ప్రస్తుతం మాడవీధులు, ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న వీధుల్లో భక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి దిగి వెళ్లేందుకు వీలు లేకుండాపోతోంది. ఇక పార్కింగ్ ప్రధాన సమస్య. సాధారణ రోజుల్లో వచ్చే భక్తులు ద్విచక్ర వాహనాలను ఎక్కడ నిలుపుకోవాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు. రాజగోపురం ఎదుటి వీధిలో నిలుపుకోవడాన్ని దుకాణదారులు, ఇళ్ల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రథోత్సవానికి భారీ ఎత్తున జిల్లా నలుమూలల నుంచి భక్తులు రానున్నారు. వారిని పోలీసులు ఆలయం నుంచి అర కిలోమీటరు దూరంలోనే నియంత్రిస్తారు. కనీసం సులభంగా ఆలయం లోకి వెళ్లే పరిస్థితులు కనిపించండం లేదు.

డోంట్ కేర్

రహదారి పరిస్థితిపై స్థానికులు ఇటీవల కార్పొరేషన్ అధికారులు దృష్టికి తెచ్చారు. స్పందించిన అధికారులు దేవుని కడప గ్రామానికి వచ్చి ఆలయం చుట్టూ పరిశీలించారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలని, దుకాణాలను ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో ఆక్రమణల తొలగింపు తమ ఉపాధిని దెబ్బతీస్తుందనుకుంటే దుకాణదారులు తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకోవచ్చని తెలిపారు. నగరపాలక సంస్థ ఉన్నతాధికారి స్వయంగా వచ్చి ఆదేశించినా ఇంతవరకు స్పందించిన దాఖలాలు లేవు. రథోత్సవానికి కేవలం మూడు రోజులే సమయం ఉండడంతో.. ఉత్సవానికి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మైనార్టీలను మభ్యపెట్టేందుకు కుయుక్తులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీ నాయకుడు షఫీ

కడప కార్పొరేషన్: ముస్లిం మైనార్టీలను మభ్యపెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నగర అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ విమర్శించారు. స్థానిక మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా పర్యటనకు విచ్చేసిన ప్రభుత్వ మైనార్టీ సలహాదారు షరీఫ్ హజ్ హౌస్ పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులకు చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు హజ్ హౌస్‌కు రూ.10కోట్లు మంజూరు చేశారని, అంతమొత్తానికి టెండర్ వేస్తే ఎవరూ రాకపోవడంతో, దాన్ని ఐదు భాగాలుగా విభజించి టెండర్లు పిలిచారన్నారు. పనులు మాత్రం ఇంతవరకూ జరగలేదన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా ఎస్టిమేషన్లు వేయాలని షరీఫ్ చెప్పడం మైనార్టీలను మభ్యపెట్టేందుకేనన్నారు. గత నెలలో ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం విడుదల చేస్తున్నామంటూ ప్రకటించిన మైనార్టీ శాఖామంత్రి ఎన్ఎండీ.ఫరూఖ్, ఇప్పటి వరకూ ఆ నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. మసీదుల మరమ్మతులకు రూ.5వేల చొప్పున ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకూ వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అజ్మతుల్లా, అబ్దుల్ సుభాన్, అతావుల్లా, అక్బర్ పాల్గొన్నారు.

సేవామూర్తులకు సన్మానం



సేవామూర్తులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కడప అర్బన్: హిమ వర్షిణి ఫౌండేషన్ సేవామూర్తులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కడప నగరంలోని అజాద్ నగర్‌లోని బృంద స్ఫూర్తి ఫౌండేషన్ వృద్ధాశ్రమం పదో వార్షికోత్సవం సందర్భంగా పేదలకు సేవలందిస్తున్న ఆర్టీసి కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, హిమవర్షిణి ఫౌండేషన్ సభ్యులు దామోదర్, రెడ్డి లక్ష్మణ్‌లను స్టెప్ సీఈఓ సాయి గ్రేస్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అడ్వకేట్ బాల సుబ్బయ్య, సతీమణి సుధారాణి పాల్గొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యంతో ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ మధు

కడప ఎడ్యుకేషన్: రోడ్డు ప్రమాదాల నివారణలో యువత భాగసాములు కావాలని పెండ్లిమర్రి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.మధు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్స వాల సందర్భంగా యోగివేమన విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-1,4,7 ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిర్ణీత స్పీడులో వెళ్లాలని, రహదారుల నియమాలు పాటించాలని సూచించారు. డా.ఎస్.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. పీవో డా.కె.లలిత మాట్లాడుతూ మహిళలు వాహనాలు నడిపేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.సునిత, డా.పి.సరిత, ఆచార్య వై.సుబ్బరాయుడు, డాక్టర్ ప్రభాకర్, డా.గంగయ్య, డా.రాజశేఖర్ పాల్గొన్నారు.

మ్యాన్ హోల్‌కు మరమ్మతులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో గురుకుల్ విద్యాపీఠ్ వెనుక ఫక్కీరుపల్లెకు పోయే మార్గంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పాడై పెద్ద గుంత ఏర్పడింది. ఇందులో నీరు నిలుస్తూ పాద చారులు, వాహనచోదకులకు ఇబ్బందిగా ఉండేది. ఈ విషయాన్ని ఈ నెల 28న ×నడి రోడ్డుపై గుంత× శీర్షికన సాక్షి వెలుగులోకి తేవడంతో పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించారు. మరమ్మతులు చేసి పూడ్చివేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: గృహ హింస విభాగంలో ఖాళీగా ఉన్న సోషల్ కౌన్సిలర్ (మహిళలకు మాత్రమే) పోస్టును కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ సాయంత్ర ఐదు గంటల్లోగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయం, డి-బ్లాక్, కలెక్టరేట్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలు పొందాలన్నారు.

అప్రమత్తంగా ఉంటూ క్యాన్సర్‌ను దూరం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఆరోగ్య సూత్రాలు పాటించి అప్రమత్తంగా ఉంటే క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలను నివారించవచ్చునని యోగివేమన విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. క్యాన్సర్ అవగాహనా మాసం సందర్భంగా వైవీయూ మహిళల వసతిగృహ విద్యార్థులకు గర్భాశయ ముఖ ద్వార కాన్సర్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనార్థం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ ఆరోగ్య సూత్రాలు తెలిపారు. స్త్రీవ్యాధి నిపుణులు డా.వై.ప్రమోదారెడ్డి మాట్లాడుతూ గర్భాశయ ముఖ ద్వార కాన్సర్ వచ్చే అవకాశాలను గుర్తించే విధానాలు, చికిత్సా పద్ధతులను విశదీకరించారు. విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అనిత, డాక్టర్ వెంకట్రామిరెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, ఆచార్య మెర్సీ , విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం జాగ్రత్త

కడప అర్బన్: చిన్నారుల విద్య, ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ అన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహంలో శుక్రవారం వీధి బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వీధి బాలల కోసం జనవరి 31వ తేదీన అంతర్జాతీయ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఈ ప్రత్యేక దినం ఆస్ట్రియన్ స్వచ్ఛంద సంస్థ జుగెండ్ ఐన్‌వెల్ట్ నుంచి ఉనికి లోకి వచ్చిందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే లీగల్ సెర్వీస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్: 1098 దృష్టికి తీసుకురావాలన్నారు. పి.వీరయ్య, డీసీపీఓ సి.చెన్నారెడ్డి, బి.లక్ష్మీ ప్రసన్న, వైద్యాధికారి జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


వసతి గృహం నిర్మించాలని వినతి



ఎం.ఎ. షరీఫ్‌కు విన్నవిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కడప మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్‌లో విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కళాశాల హెచ్‌ఓడీ డా.హకీముద్దీన్ అహ్మద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ సిఖందర్ హుస్సేన్ అన్నారు. కడపకు విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎం.ఎ. షరీఫ్‌ను శుక్రవారం వారు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమ్ (పిఎంజెవికె) పథకం కింద హాస్టల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు. ఎం.ఎ.షరీఫ్ స్పదిస్తూ త్వరిగతిన వసతి గృహల నిర్మిస్తామని తెలిపారు.

వైభవంగా కన్యకాంబ ఆత్మార్పణ దినోత్సవం



కలశ సేవలో కన్యకలు

కడప కల్చరల్: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కన్యకాంబ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నకాష్‌లోని పాండురంగస్వామి ఆలయం నుంచి ముందుగా 108 మంది దీక్షలో ఉన్న కన్యకలు క్షీర కలశాలతో అమ్మవారిశాల వరకు ఊరేగింపుగా వచ్చారు. కలశాలలోని క్షీరంతో అమ్మ వారిని అభిషేకించి విశేష పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారి మూలమూర్తికి సహస్ర నామార్చన, త్రిశతి దేవి ఖడ్గమాల పఠించారు. నైవేద్యం సమర్పించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కన్యకలు, సువాసినులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. భక్తులు కోలాటం ప్రదర్శించారు. అనంతరం సాయంత్రం అమ్మవారిని అగ్నిగుండ ప్రవేశం చేయించారు. భక్తులు నిప్పులపై నడిచి తమ భక్తిని చాటుకున్నారు.


నిర్వాహకులు మాట్లాడుతూ ప్రాణం కంటే ఆత్మాభిమానమే ముఖ్యమని చాటుతూ పాలకుల దౌర్జన్యాన్ని ఎదిరించి తమ వర్గాలకు ఆదర్శంగా నిలిచిన వాసవాంబ ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు.

వాసవీ ఎన్‌క్లేవ్‌లో....

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కడప నగరం ఎన్జీఓ కాలనీ వాసవీ ఎన్‌క్లేవ్‌లోగల అమ్మవారి మందిరంలో వాసవీ గ్రాఫిక్స్ నిర్వాహకులు లయన్ రమేష్, పి.భూపేష్‌గుప్తా, పి.ఉమామహేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. తొలుత పుణ్యాహవచనం, అనంతరం వాసవీ మాత అష్టోత్తర శతనామార్చన, కుంకుమార్చన, పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి అష్టోత్తర శతనామావళితో తులసీదళార్చన, నివేదన నిర్వహించారు. భక్తులందరికీ అమ్మవారి కుంకుమ అందజేశారు.

జ్ఞానదీపాన్ని వెలిగించి.. విజేతలుగా నిలవండి

వ్యక్తిత్వ వికాస నిపుణులు డా.వర్లు



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు వర్లు

కడప ఎడ్యుకేషన్: మనిషి మెదడుకు పది వేల కోట్ల కంప్యూటర్ శక్తి ఉంది.. మీలో నిగూఢంగా ఉన్న శక్తిని తెలుసుకోండి.. జ్ఞాన దీపాన్ని వెలిగించండి అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణలు డా.వర్లు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ప్రాంగణంలో శుక్రవారం మానసిక వికాస ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డా.వర్లు మాట్లాడుతూ జ్ఞానాన్ని ఉపయోగించుకున్నవారే గొప్ప వారుగా నిలుస్తారన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రశ్న లేకపోతే ప్రగతి ఉండదన్నారు. యువతలో ఎక్కువమందికి తాము ఏమి కావాలనుకుంటున్నారో తెలియదన్నారు. చిన్న వయసులోనే ఒక బలమైన నిర్ణయం తీసుకొని అమలుచేసేందుకు ప్రయత్నించాలన్నారు. సెల్ ఫోన్, ఫేస్ బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ వంటివి కాలహరణ చేస్తాయని, ప్రేమలు సినిమాల్లోనే సక్సెస్ అవుతాయని నిజజీవితంలో కాదన్నారు. ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ గొప్ప ఆలోచనలు చేసి వాటిని కార్యరూపం చేయగల అత్యున్నత శక్తి ఒక్క మనిషికి మాత్రమే ఉందన్నారు ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ స్థానంలో న్యూక్లియర్ ఫ్యామిలీలు వచ్చాయని తెలిపారు. కుల సచివులు ఆచార్య పుత్తాపద్మ మాట్లాడుతూ మెదడు సంజీవినిలాంటిదని, దాన్ని ఎప్పుడూ ఉత్తేజంగా ఉంచేందుకు వ్యక్తిత్వ వికాస తరగతులు అవసరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్య నిపుణులు డా. శ్రీధర్ రెడ్డి, డా.అనూప్రసన్న, డా.టి.సురేష్ బాబు, ఆచార్య రియాజున్నీసా హాజరయ్యారు.

మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను ప్రకటిస్తున్న, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప శ్రీహరి డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల కరస్పాండెంట్ జి.సుబ్బారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బాస్కర్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ కోర్సులలో విద్యార్థులు 72 శాతం పాసైనట్లు తెలిపారు. ముత్తహర్, అంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ కోసం ఫిబ్రవరిలో 48 గంటల దీక్ష

రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్ రెడ్డి, జయవర్ధన్



గోడ పత్రాలు విడుదల చేస్తున్న ప్రదీప్ రెడ్డి, జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో 48 గంటల దీక్ష చేపడుతున్నట్లు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిలు ప్రదీప్‌రెడ్డి, జయవర్ధన్ పేర్కొన్నారు. స్థానిక ఓంశాంతి నగర్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో దీక్షకు సంబంధించిన గోడపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి, జయవర్ధన్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి సుబ్బమ్మ మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు జరిగితే రాయలసీమ జిల్లాలలోని నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు అసెంబ్లీ, పార్లమెంటులో కానీ ఉక్కు పరిశ్రమపై నోరు మెదపలేని దుస్థితిలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సగిలి రాజేంద్రప్రసాద్, హిమబిందు, అరుణ కుమారి, హరిత, శేఖర్ ,ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఏల సీనియారిటి జాబితాను ప్రకటించాలి



ఆర్డీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో 2002 నోటిఫికేషన్‌కు సంబంధించి జోనల్ వైజ్ ఎంపీహెచ్‌ఎ(ఎం) సీనియారిటీ జాబితా ప్రకటించేలా ఆయా జిల్లాల వైద్యాధికారులకు ఆదేశాలివ్వాలని అనంతపురం జిల్లా ఎంపీహెచ్‌ఏ సంఘం అధ్యక్షుడు జాన్సన్, కడప జిల్లా అధ్యక్షుడు షాజహాన్ కోరారు. వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ రామగిడ్డయ్యను కడప ఆర్‌డీ కార్యాలయంలో శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2002 ఎంపీహెచ్‌ఏ బ్యాచ్‌కు సంబంధించిన వారు 2024 మే, 1వ తేదీ నుంచి 4వ జోన్‌లో రెగ్యులర్ ఉద్యోగులుగా ఎంపిక అయ్యారన్నారు. కానీ ఆ జోన్ పరిధిలోని అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప జిల్లాలకు సంబంధించి ఎంపీహెచ్‌ఏ(ఎం) సీనియారిటి జాబితా తయారు చేయాల్సి ఉందన్నారు. ఈ సీనియారిటి జాబితా తయారీ ఆదేశాలివ్వాలన్నారు. అన్ని జిల్లాల నుంచి అందిన ఎంపీహెచ్‌ఏ సీనియారిటి జాబితాను క్రోడీకరించి జోనల్ సీనియారిటి జాబితా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కరణం శివకుమార్, జానీ, హరికృష్ణ , మకుంద, గంగరాజు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ఎస్టీయూ కృషి



ఎస్టీయూ క్యాలెండర్‌ను అవిష్కరిస్తున్న చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్టీయూ కృషి అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. నగరంలోని ఎస్టీయూ డైరీ మరియు క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులెవరైనా విద్యను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారేగానీ, అభివృద్ధి పరిచే చర్యలు చేపట్టలేదన్నారు. గోరుచుట్టు మీద రోకటిపోటులా ప్రభుత్వం మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలన్నింటినీ విలీనం చేస్తామనడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఈ విలీన ప్రక్రియను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, రమేష్ రాజ, వలరాజు పాల్గొన్నారు.

ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ కడప జిల్లా మహా సభలు ఈ నెల 30న నిర్వహించడం జరిగిందన్నారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వామనమూర్తి, ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో కడప జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడుగా వై.హరి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉద్దె.మద్దిలేటి, జిల్లా ఉపాధ్యక్షులుగా నాగిరెడ్డి, బి.శంకర్‌నాయక్, ఎల్లయ్య, చంద్ర, కడప జిల్లా సహాయ కార్యదర్శులుగా వి.పుల్లయ్య, ఎ.నారాయణ, శ్రీనివాసులు, పీరయ్య, తదితరులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. రెడ్డయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల రెండో రోజున జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను నడపలేమని కూటమి ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. విద్యా వసతి దీవెన వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని, నారాయణ విద్యా సంస్థల అధిక ఫీజు వసూళ్లను అరికట్టకుండా కార్పొరేట్ వ్యవస్థకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. అధిక ఫీజు ఒత్తిడితో చరణ్ అనే విద్యార్థి మరణిస్తే.. చర్యలు తీసుకోవడం కానీ, కమిటీ వేయడం కానీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, అభినయ్, చారి, సుమంత్, మోహన్ వంశీ, వినోద్, ఉదయ్, శివ, రాజేష్, అసిఫ్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలిచిన యోధుడు సుబ్బన్న

కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్మిక, కష్ట జీవులకు అండగా నిలిచిన జన పోరాటయోధుడు కామ్రేడ్ సుబ్బన్న అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. కమ్యూనిస్టు నేత సుబ్బన్న వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాలిచంద్ర మాట్లాడుతూ ఆలంఖాన్‌పల్లెలో పెత్తందారీతనానికి వ్యతిరేకంగా, ఎస్సీ కాలనీ నిర్మాణంలోనూ, దండు, యానాది కాలనీ స్థాపించడం, తదితర వాటిలో క్రియాశీలక పోరాటాలకు సుబ్బన్న నాయకత్వం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో నాగసుబ్బారెడ్డి, యస్. వెంకటశివ, బి.రామయ్య, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, కేసీ.బాదుల్లా, యు.మద్దిలేటి, మనోహర్‌రెడ్డి, గౌస్, శంకర్ నాయక్, భాగ్యలక్ష్మి, శివశంకర్, పక్కీరప్ప చెంచయ్య, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

రక్తదానంతో పునర్జన్మ

కడప కోటిరెడ్డి సర్కిల్: రక్తదానంతో క్షతగాత్రులకు పునర్జన్మ లభిస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి తెలిపారు. జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ నగర్ రోడ్ నెంబర్ 13లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికంఠ, అశోక్, కాశి, గణేష్, సురేంద్ర, అఖిలేష్, ఆయేషా, సిరిచందన, తీర్థ, కార్తీక్, పట్టు పోగుల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉర్దూ పాఠశాలల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కెసీ.బాదుల్లా అన్నారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో ఉర్దూ పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకరంగా మారిందన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వమే ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించిందని గుర్తు చేశారు. నేడు ఎన్‌డీఏ కూటమిలోని ఉర్దూ మైనార్టీ వ్యతిరేక శక్తులు భాషను భూస్థాపితం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. క్లస్టర్ విధానంలో పాఠశాలలను విలీనం చేసియాలంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ పాఠశాలల్లో దాదాపు వేయి పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గౌస్, ఎస్.హుస్సేన్ పాల్గొన్నారు.